క్లుప్తంగా

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

రాజేంద్రనగర్ జోనల్ కార్యదర్శి బాలస్వామిరెడ్డి



మొయినాబాద్‌రూరల్: క్రీడలతో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని రాజేంద్రనగర్ జోనల్ కార్యదర్శి టి బాలస్వామిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాఠశాలలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జోనల్ స్థాయి వాలీబాల్‌లో ప్రతిభ కనబర్చాలన్నారు. రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్, మొయినాబాద్ మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 14–17 సంవత్సరాలలోపు విద్యార్థులు పాల్గొనవచ్చన్నారు. ఈ వాలీబాల్ టోర్నమెంట్ ఈ నెల 29నుంచి అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించబడుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు బోనఫైడ్, ఆధార్ కార్డుతో హాజరుకావాలని తెలిపారు. మరింత సమాచారం కోసం 9866706457లో సంప్రదించాలని ఆయన కోరారు.

బోధునంపల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ స్వాతి

కేశంపేట: బోధునంపల్లిలో శుక్రవారం షాద్‌నగర్ పట్టణంలోని వేనేషియా కంటి ఆసుపత్రి వారు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ స్వాతి 60 మందికి కంటి పరీక్షలను నిర్వహించి అవసరమైన వారికి సబ్సిడీపై ఆపరేషన్లను నిర్వహిస్తామని తెలిపారు. వర్షాకాలంలో కళ్ల కలక వస్తుందని తగిన జాగ్రత్తలు పాటించాలని ఆమె ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆప్తమాల జిస్ట్ సంధ్య, లక్ష్మీనారాయణ, మునీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నేటికి ఇందిరమ్మ ఇళ్లలోనే పేదల జీవనం

కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నరేందర్



మాట్లాడుతున్న నరేందర్

కొందుర్గు: నేటికీ గ్రామాల్లోని పేదలు ఇందిరమ్మ ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నారని కాంగ్రెస్ ఎస్సీ విభాగం మండల కమిటీ అధ్యక్షుడు నరేందర్ పేర్కొన్నారు. శుక్రవారం కొందుర్గులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల కష్టాలను గుర్తించి పేదలకు భూములిచ్చి, ఇళ్లు నిర్మించిన ఘనత తమపార్టీదేనన్నారు. కాంగ్రెస్ నిరుపేదలకు ఇచ్చిన భూములను బీఆర్ఎస్ లాక్కుంటుందన్నారు. చేవెళ్లలో నిర్వహించబోయే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభకు ప్రతీ ఒక్కరు హాజరుకావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో గోవర్ధన్ గౌడ్, రవీందర్, రమేశ్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతర కృషి

చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి



పనులు ప్రారంభిస్తున్న విజయలక్ష్మి

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నానని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి పేర్కొన్నారు. రామంతపురంలో రూ.11లక్షలతో అండర్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. ప్రభుత్వం కూడా మున్సిపాలిటీలోని వార్డుల్లో సీసీ రోడ్లకు, అండర్‌డ్రైనేజీ ఏర్పాటునకు పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్ చాకలి శోక్, ఏఎంసీ చైర్మన్ పాపారావు, కో ఆప్షన్ సభ్యుడు వెంకట్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కావలి గోపాల్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతలో రాజీ పడొద్దు

ఎంపీఓ రఘు

తలకొండపల్లి: అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీపడకుండా పనులు చేపట్టాలని ఎంపీఓ రఘు అన్నారు. ప్రభుత్వ నిబంధనలకు మేరకు సిమెంట్, కాంక్రీట్, ఇసుక, స్టీల్, తదితర మెటీరియల్‌ను సమ పాళ్లలో వాడుతూ నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోనలి గౌరిపల్లిలో ఏఈ విద్యాసాగర్‌తో కలిసి పర్యటించారు. ఈ సదర్బంగా పంచాయతీ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఆయన వెంట సర్పంచ్ అనురాధ, నరేందర్‌గౌడ్, మేట్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణాలకు కొత్త కళ

వచ్చేస్తున్నాయి.. కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు
- మండలంలో 23 జీపీలకు త్వరలో అందజేత
- యువతను ఆటల్లో ప్రోత్సహించేందుకే పంపిణీ



ఇప్పలపల్లి క్రీడా ప్రాంగణం

కేశంపేట: గ్రామీణ ప్రాంతాల్లో యువతి, యువకులు చదువుతో పాటు క్రీడాల్లో రాణించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. దీని కోసం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను నిర్మించారు. ఆడుకోవడానికి క్రీడా వస్తువులు లేకపోవడంతో క్రీడా మైదానాలు నిరుపయోగంగా తయారయ్యాయి. దీన్ని గమనించిన అధికారులు యువతను ప్రోత్సహించేందుకు క్రీడా పరికరాలను అందజేయడంతో పాటు క్రీడల్లో శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (సాట్స్) ఆధ్వర్యంలో కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను క్రీడా ప్రాంగణాలకు అందజేసేందుకు మండల పరిషత్ కార్యాలయాలకు అధికారులు పంపించారు. ఇక్కడి నుంచి అవి క్రీడా ప్రాంగణాలకు చేరుకోనున్నాయి.

23 క్రీడా ప్రాంగణాలు పూర్తి..

మండల పరిధిలో 29 గ్రామ పంచాయతీలు ఉండగా 23 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను గ్రామ పంచాయతీ, జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా అధికారులు ప్రజాప్రతినిధులతో కలిసి నిర్మాణాలను పూర్తి చేయించారు. ప్రస్తుతం క్రీడా ప్రాంగణాలను పూర్తి చేసుకున్న గ్రామ పంచాయతీలకు మాత్రమే కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లను అందించనున్నారు. క్రీడా ప్రాంగణాల ఏర్పాటును గ్రామ పంచాయతీలో ఉన్న భూమిని బట్టి ఎకరం విస్తీర్ణం వరకు క్రీడా ప్రాంగణాలను పూర్తి చేశారు. క్రీడా వస్తువులను అందించకపోవడంతో యువత ఆడుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇప్పుడు ఆట పరికరాలను అందిస్తుండటంతో క్రీడా ప్రాంగణాలకు కొత్త కళ సంతరించుకోనుంది. స్పోర్ట్స్ కిట్లను గ్రామాల్లో అందిస్తే



వాలీబాల్ కిట్

యువత వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యంతో పాటు శారీరకంగా దృఢంగా తయారవుతారు. పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, వేములనర్వ, చింతకుంటపల్లి, కేశంపేట, లేమామిడి, నిర్దవెల్లి, సుందరపురం, తొమ్మిదిరేకుల, బోధునంపల్లి, దత్తాయపల్లి, సంగెం, ఎక్లాస్‌ఖాన్‌పేట, పుట్టోనిగూడ, బైర్కాన్‌పల్లి, మంగళిగూడ, అల్వాల, కొత్తపేట, కొనాయపల్లి, సంతాపూర్, తూర్పుగడ్డతండా, దేవునిగుడితండా, చౌలపల్లి గ్రామాల్లోని క్రీడా ప్రాంగణాలకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు మంజూరయ్యాయి.

> **ఉన్నతాధికారుల ఆదేశాల మేర అందజేస్తాం**
>
> 
>
> స్పోర్ట్స్ కిట్లు మండల పరిషత్ కార్యాలయానికి చేరాయి. ఉన్నతాధికారుల ఆదేశాల మేర త్వరలోనే పూర్తయిన క్రీడా ప్రాంగణాలకు చేరవేస్తాం.
>
> – రవిచంద్రకుమార్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ, కేశంపేట మండలం

కేసీఆర్ స్పోర్ట్స్ కిట్..

క్రీడాపరికరాల్లో టీషర్టులు, మూడు వెర్వేరు కిలోల డంబెల్స్ (2.5, 5, 7.5 కిలోలు), క్రికెట్, వాలీబాల్ కిట్, స్విమ్మింగ్, డిస్క్‌త్రో, టెన్నికాయిట్, రింగ్, స్కిపింగ్ రోప్, విజిల్, వాల్‌పంపు, స్టాప్ గడియారం, 30 ఫీట్ల మెజరింగ్ టేప్ తదితర వస్తువులను కిట్‌లో అందిస్తున్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ కుటుంబ పార్టీలు

మంగుళూర్ ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్



చౌదరిగూడలో మాట్లాడుతున్న వేదవ్యాస్ కామత్

కొందుర్గు: కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు కుటుంబ పార్టీలేనని, ఈ రెండూ తమ కుటుంబ సభ్యులకు ఆస్తులు కూడబెట్టడానికే తప్ప ప్రజాసేవకు పనికిరాని పార్టీలని కర్ణాటక రాష్ట్రం మంగళూర్ ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదికి దేశ ప్రజలే కుటుంబ సభ్యులని అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని ఆర్యసమాజంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రధాని తొమ్మిదేళ్లుగా అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషిచేశారని అన్నారు. గ్రామాల అభివృద్ధిలో భాగంగా వీధిలైట్లు, పల్లె ప్రకృతివనాలు, రైతు వేదికలు, సీసీ రోడ్లు ఏర్పాటు వంటివి చేసింది కేంద్ర ప్రభుత్వమేనన్నారు. కరోన సమయంలో ఉచితంగా కరోన టీకాలు, బియ్యం పంపిణీ చేశారన్నారు. ప్రధాని మోదీ పథకాలపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగిరేలా కార్యకర్తలు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీవర్ధన్ రెడ్డి, అశోక్ గౌడ్, భూపాలచారి, విజయ్‌కుమార్, మహేందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, శ్రీనివాసు, సాయిబాబా, శివారెడ్డి, మండల కమిటీ అధ్యక్షుడు కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

పశుపోషణలో మెలకువలు తప్పనిసరి

పశువైద్యాధికారి స్ఫూర్తి



టీకా వేస్తున్న డాక్టర్ స్ఫూర్తి

కొత్తూరు: పశుపోషణలో రైతులు వైద్యులు ఇచ్చిన మెళకువలు తప్పనిసరిగా పాటించాలని మండల పశువైద్యాధికారి స్ఫూర్తి అన్నారు. శుక్రవారం తీగాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన పశువైద్య శిబిరంలో 100 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. అనంతరం ఆమె రైతులకు పశువుల్లో వచ్చే సీజనల్ వ్యాధులు, వాటి నివారణ పద్ధతులపై అవగాహన కల్పించారు. పశువులు అనారోగ్యానికి గురైతే నిర్లక్ష్యం చేయకుండా వైద్యం చేయించాలని సూచించారు. ముఖ్యంగా పశువుల పాకను ఈగలు, దోమలు లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, పశువైద్య సిబ్బంది శ్రీలత, మల్లేశ్, రవి, కృష్ణ, రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పేద లబ్ధిదారులను గుర్తించాలి

ఎంపీటీసీ బద్దం సురేందర్ రెడ్డి



మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

శంకర్‌పల్లి: పేద లబ్దిదారులను వెంటనే గుర్తించి వారికి బీసీ బంధు మంజూరు చేయాలని కొండకల్ ఎంపీటీసీ బద్దం సురేందర్ రెడ్డి పేర్కొన్నారు. శంకర్‌పల్లిలో శ్రువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ బంధు కోసం 25నుంచి 30మంది దరఖాస్తు చేసుకోగా ఏ ఒక్కరిని కూడా ఎంపిక చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కొండకల్, శేరిగూడ గ్రామాల్లో బీసీ, ఎస్సీ జనాభా ఎక్కువగా ఉంటుందన్నారు. కానీ ఏ ఒక్కరిని గుర్తించి బీసీ బంధు ఇవ్వలేదన్నారు. ఇక మైనార్టీ బంధు కూడా దిక్కు లేదన్నారు. దళిత బంధు కూడా అందలేదన్నారు. పెన్షన్ల కోసం సుమారు 60మంది దరఖాస్తు చేసుకొని రెండు సంవత్సరాలు అవుతున్నా నేటికి అతిగతి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఈ విషయంలో ఎమ్మెల్యే యాదయ్య స్పందిచి సమస్యలను పరిష్కరించకపోతే రాజీనామ చేయడానికి కూడా తాము వెనుకడుగు వేయబోమన్నారు. ఈ కార్యక్రమంలో గుడిమల్కాపురం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ధర్మన్నగారి వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకుడు శివకుమార్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని వివిధ గ్రామాల లబ్దిదారులకు శుక్రవారం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. వీరన్నపేటకు చెందిన మౌనికకు రూ.32 వేలు, తుమ్మలపల్లికి చెందిన శ్రీకాంత్‌కు రూ.19,500లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ స్వామి, నర్సింగ్‌రావు, వెంకటేశ్, శంకరప్ప, చంద్రబాబుగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకే బీసీ బంధు

మొయినాబాద్: బీసీ బంధు రూ. ఒక లక్ష సాయాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారని మందడి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు ఇవ్వాల్సిన ఆర్థిక సహాయాన్ని బీఆర్ఎస్ నాయకుల అనుచరులు, కార్యకర్తలకే మంజూరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతీ గ్రామం నుంచి వందల్లో దరఖాస్తు చేసుకుంటే అర్హులైనవారికి ఇవ్వకుండా బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేతలు సూచించినవారికే బీసీ బంధు చెక్కులు పంపిణీ చేశారని మండిపడ్డారు. ప్రజాధనాన్ని బీఆర్ఎస్ కార్యకర్తలకు పంచుతూ నిజమైన అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేద లబ్ధిదారులకు బీసీ బంధు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఓటు నమోదు చేసుకోండి



అప్పలనాయుడు

షాబాద్: 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని షాబాద్ తహసీల్దార్ చిన్న అప్పలనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం షాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 26, 27న ప్రత్యేక ఓటరు నమోదు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతీ పోలింగ్ కేంద్రం వద్ద సంబంధిత బీఎల్‌ఓలు అందుబాటులో ఉంటారన్నారు. బీఎల్‌ఓలు తమ పోలింగ్ బూత్‌లను పరిశీలించి గది, విద్యుత్, మరుగుదొడ్ల నిర్వహణ తదితర విషయాలను గుర్తించి తమకు సమాచారం ఇవ్వాలని తహసీల్దార్ తెలిపారు. ప్రాథమిక స్థాయిలో బాధ్యతతో పనిచేసి అర్హులను ఓటరు జాబితాలో చేర్చాలన్నారు. ఇప్పటికీ కొందరిపేర్లు తప్పుగా ఉండి, మరికొందరి పేర్లు జాబితాలో లేకుంటే వారికి తగిన అవగాహన కల్పించి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. చనిపోయిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మధు తదితరులు పాల్గొన్నారు.

28న ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్

కొత్తూరు: ఈ నెల 28, 29తేదీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్ నిర్వహించనున్నారు. కొత్తూరు పట్టణంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో పీడీ విజయ్‌సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ మండలంలోని రంగాపూర్ గ్రామంలో హిప్పో పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహిస్తారని తెలిపారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్‌తో పాటు అథ్లెటిక్ విభాగాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తి ఉన్న మండలంలోని విద్యార్థులు టోర్నమెంట్ ఇన్‌చార్జి ఇన్ముల్‌నర్వ జెడ్పీహెచ్‌ఎస్ పీఈటీ పుణ్యవతిని సంప్రదించాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 27లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఆమె కోరారు.

కనుల పండువగా బోనాలు



కొందుర్గులో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కొందుర్గు: కొందుర్గు మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పోచమ్మ దేవత బోనాలు కనుల పండువగా సాగాయి. మహిళలు సాంప్రదాయ దుస్తులు ధరించి బోనం ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాల్లో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు పలువురిని ఎంతగానో ఆకట్టుకున్నాయి.

స్వచ్ఛమైన తాగునీటి సరఫరా

లక్ష్మరావుగూడ సర్పంచ్ అనిత



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ అనిత

షాబాద్: గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేసేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని లక్ష్మరావుగూడ సర్పంచ్ అనిత పేర్కొన్నారు. శుక్రవారం లక్ష్మరావుగూడలో బాలవికాస్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో (ఏటీడబ్ల్యూ) ఎనీ టైం వాటర్ ప్లాంట్‌ను సంస్థ సీనియర్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, ఫీల్డ్ కో–ఆర్డినేటర్ వినోద్‌కుమార్‌రెడ్డితో కలిసి ఆమె ప్రాంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. వర్షాకాలంలో మినరల్ వాటర్ తాగడం వల్ల ఆరోగ్యంగా ఉండడమే కాకుండా, వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డి, సత్తయ్య, కుమార్, శ్రీశైలం, నరేందర్‌రెడ్డి, శ్రీరాము, వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాటికాపరుల సమస్యలు పరిష్కరించాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు సత్తయ్య



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాటికాపరుల సంఘం నాయకులు

తలకొండపల్లి: ప్రభుత్వం కాటికాపరుల సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాల ఆ కుల సంఘం జిల్లా అధ్యక్షుడు గాదె సత్తయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో సంఘం మండల అధ్యక్షుడు చెన్నయ్య, జిల్లా ఇన్‌చార్జి గాదె కుమార్‌ల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. 50 ఏళ్లు నిండిన వారికి రూ.5వేల పెన్షన్, మృతి చెందిన వారికి రూ.25లక్షల బీమా, దహన సంస్కరణాలకు తక్షణ సాయంగా రూ.25వేలు శ్మశాన వాటిక కాటికాపరులకు అప్పగించాని డిమాండ్ చేశారు. అనంతరం తమ సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దార్ కేవీ రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగం, రామచంద్రయ్య, రాములమ్మ, మల్లేశ్, మాసయ్య, రాములమ్మ, నరసింహ, దేవమ్మ, మహేశ్, రాములు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఓటు మనదే.. సీటు మనదే

- టికెట్ ఇవ్వని బీఆర్ఎస్‌కు బుద్ధి చెప్పాలి
- ముదిరాజ్ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అంచరాములు



మాట్లాడుతున్న అంచరాములు

షాద్‌నగర్‌రూరల్: ముదిరాజులకు ఎమ్మెల్యే టికెట్ కేటాయించని బీఆర్ఎస్‌కు తగిన బుద్ధి చెప్పాలని సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు అంచరాములు పిలుపునిచ్చారు. పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో శుక్రవారం ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు కుడుములబాల్‌రాజ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంచరాములు, ఉపాధ్యక్షుడు మంగవెంకటేశ్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. అనంతరం అంచరాములు మాట్లాడుతూ...తక్కువ జనాభా ఉన్న అగ్రకుల నాయకులకు ఎక్కువ సీట్లు కేటాయించి, అత్యధిక జనాభా కలిగిన ముదిరాజులకు ఒక్క టికెట్‌కూడా ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌లు 60 లక్షలకు పైగా ఉన్నారని, నియోజకవర్గంలో సుమారు 50వేలకుపైగా ఉన్నామన్నారు. ముదిరాజ్‌లు ఐకమత్యంతో ఉండి 'మన ఓటు మన సీటు' నినాదంతో ముందుకు సాగాలన్నారు. ఈ సమావేశంలో మంగమధు, గుంటిశంకర్, కావలిశ్రీశైలం, బుడ్డనర్సింహ్మ, సత్యనారాయణ, ప్రశాంత్, యాదయ్య, జంగయ్య, మదన్‌మోహన్, రవి, రమేశ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కౌన్సిల్ సభ్యుడిగా మహేందర్‌రెడ్డి



మహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మంగుళూరు ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్

షాద్‌నగర్‌రూరల్: సెంట్రల్ ఫిల్మ్ సెన్సార్‌బోర్డు సభ్యుడు, న్యాయవాది చెందిమహేందర్‌రెడ్డిని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమించినట్లు ఆయన తెలిపారు. అనంతరం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ తనపై నమ్మకంతో, విశ్వాసంతో బాధ్యత అప్పగించినందుకు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ అభివృద్ధికి అహర్నిశలు సహాయ సహకారాలు అందజేస్తానని పేర్కొన్నారు. మంగళూరు ఎమ్మెల్యే వేదవ్యాస్ కామత్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ డాక్టర్ విజయకుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేపల్లిఅశోక్‌గౌడ్‌లు చెందిమహేందర్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.



మొయినాబాద్‌లో వరలక్ష్మీ వ్రతంలో మహిళలు

మా ఇంటికి రావమ్మా.. 'వరలక్ష్మి'



షాబాద్‌లో పూజలో పాల్గొన్న మహిళలు

హిందూ సంప్రదాయం ప్రకారం మహిళలు అత్యంతా భక్తి శ్రద్ధలతో వరలక్ష్మి వ్రతాన్ని నిర్వహించారు. ప్రతీ సంవత్సరం శ్రావణ మాసంలో ఈ పూజ చేస్తారు. ఆయా మండలాల్లోని గ్రామాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా పలు ఆలయాలు కిటకిటలాడాయి. ఇళ్లలో మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గౌరమ్మను పెట్టి పూజించి ముత్తయిదులకు వాయనాలు అందజేశారు. సాక్షి, నెట్‌వర్క్



షాబాద్: శిశు మందిర్ పాఠశాలలో సామూహిక వ్రతంలో మహిళలు, తదితరులు